# ఎస్వీ మ్యూజియంలో టీటీడీ చైర్మన్ సందర్శన



**తిరుమల పెన్ పవర్ మే 30 :** తిరుమలలో ఎస్వీ మ్యూజియం ఆధునీకరణ పనులను టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు బోర్డు సభ్యురాలు శ్రీమతి పనబాక లక్ష్మి తో కూడి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీసీఎస్ సంస్థ సిఎస్ఆర్ కింద రూపొందిస్తున్న గ్యాలరీలను ఆయన పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. తిరుమల క్షేత్ర చరిత్ర, వైభవం, పురాణాల విశిష్టత ప్రతిబింబించేలా, భక్తులకు ఆధ్యాత్మిక జ్ఞానం అందించేలా మ్యూజియాన్ని అభివృద్ధి చేసి పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని చైర్మన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఆరోగ్య శాఖ మరియు ఇంచార్జ్ చీఫ్ మ్యూజియం ఆఫీసర్ సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఏవిఎస్వో విశ్వనాథ్, మ్యూజియం క్యూరేటర్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




### నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో

## వర్షాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ మే 30 :** నైరుతి రుతుపవనాలు ముందుగా వస్తున్నందున విరివిగా వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లాలో నైరుతి రుతుపవనాలు వారం ముందుగానే ప్రవేశించిన నేపథ్యంలో విరివిగా వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయని జిల్లా యంత్రాంగం అప్రమత్తముగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులుతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించి అన్ని శాఖల జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరాలలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) ప్రకారం కార్యాచరణను రూపొందించుకొని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, వాటి ఫోన్ నంబర్లను మరియు టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చెరువు, కాలువ గట్లను సమన్వయంతో ఉమ్మడిగా తనిఖీ చేసి, వాటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ వారు అన్ని వైద్య ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది వైద్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉంటూ కావలసిన వైద్య పరికరాలను మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీస్, అగ్నిమాపక శాఖ, జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ, రెవెన్యూ గ్రామ పంచాయతీ ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది వర్షాకాల నేపథ్యంలో నదీ పరివాహక గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కాజ్‌వేలు రోడ్లపైకి వరద నీరు వచ్చే ప్రాంతాల్లో వాహనాలకు ఆ సమయంలో అనుమతి ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇరిగేషన్, విద్యుత్ (ఏపీ ఈపీడీసీఎల్), రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రత్యేకంగా చెప్పారు. గత ఏడాది రోడ్డు పైకి వరద నీరు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం రుతుపవనాలు రానున్న సందర్భంగా పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని , జిల్లా ప్రజల రక్షణే తమ ముఖ్య బాధ్యతగా భావిస్తూ తరువాయి 4లో..

# తిరుమలలో భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష



**తిరుమల పెన్ పవర్ మే 30 :** దేశంలో ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తిరుమలలో భద్రతను ఏ విధంగా మరింత బలోపేతం చేయాలన్న అంశంపై ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరిష్ కుమార్ గుప్తా, టీటీడీ ఈవో జె. శ్యామల రావు సమక్షంలో శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉన్నత స్థాయి భద్రత సమావేశం జరిగింది. ఈ సమావేశం ప్రారంభంలో ముందుగా తిరుపతి ఎస్పీ మరియు టీటీడీ ఇన్ ఛార్జ్ సీవీఎస్వో హర్షవర్ధన్ రాజు భద్రతా అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో తిరుమలకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు. ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హెూంగార్డు, సివిల్ పోలీసు, టీటీడీ సెక్యూరిటీతోపాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. వివిధ సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలని సూచించారు. అలిపిరి వద్ద బహుళ స్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలసి సెన్సార్ ప్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రత వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా ఆయన చర్చించారు. అనంతరం టీటీడీ ఈవో జె.శ్యామల రావు మాట్లాడుతూ భద్రతపై అనుబంధ ఏజెన్సీలతో ఒక సమన్వయ వ్యవస్థ అవసరమని అభిప్రాయ పడ్డారు. తిరుమలలో సైబర్ భద్రతా వ్యవస్థను మరింతగా బలోపేతం చేయాలని పేర్కొన్నారు. విస్తృతస్థాయిలో తిరుమల భద్రతా సమీక్ష నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్ సుధాకర్ రెడ్డి, అడిషనల్ డీజీ ఇంటలిజెన్స్ మహేష్ చంద్ర లడ్డా, అనంతపురం రేంజ్ డీఐజీ డా.శేముషి, ఐఎస్ డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, డీఎఫ్ఓ వివేక్ ఆనంద్, అలాగే వివిధ భద్రతా బలగాల అధికారులు పాల్గొన్నారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ నిఘా మరియు భద్రత అధికారులు, వివిధ విభాగాల టీటీడీ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



### వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం





**చిత్తూరు పెన్ పవర్ మే 30 :** యోగాంధ్ర (మే 21 నుండి జూన్ 21 వరకు) మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం చిత్తూరు ప్రశాంత్ నగర్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు జిల్లా స్థాయి మెగా యోగా క్యాంపెయిన్ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో యోగా గురువులుచే నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జిల్లా కలెక్టర్ వారితో పాటు డిఆర్ఓ కె.మోహన్ కుమార్, డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, మెప్మా పిడి రాధమ్మ, జిల్లా పర్యాటకశాఖ అధికారి గౌరీ, పలమనేరు ఆర్డీఓ భవానీ, యోగా గురువులు తదితరులచే జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. యోగా గురువులు యోగా చేసే విధానంను సవివరంగా వివరిస్తున్నారు. ఈ మెగా యోగ క్యాంపెయిన్‌లో జిల్లా అధికారులు జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు,డి సి హెచ్ఎస్ డా.పద్మిని, సిపిఓ సాంబ శివా రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసి వెంకట రమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి, చిత్తూరు ప్రధాన ఆస్పత్రి సూపరిండెంట్ డా.ఉషా శ్రీ, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనివాస్, డిఎల్‌డిఓ రవి కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, సిఎంసి, అపోలో మెడికల్ కాలేజీల విద్యార్థులు, మహిళలు, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలి

### - ఆసుపత్రిలో అదనపు పార్కింగ్ స్థలాలను గుర్తించండి
### - ఆసుపత్రిలోని అంతర్గత రోడ్లను మెరుగుపరచండి : మంత్రి టి.జి.భరత్



**కర్నూలు, పెన్ పవర్, మే 30 :** ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు, ఇతర అధికారులను ఆదేశించారు. స్టేట్ గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధిపై ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు, మున్సిపల్, హార్టికల్చర్, తదితర అధికారులతో మంత్రి టి.జి.భరత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి మరియు ప్రజలకు సేవలను అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఆసుపత్రి యొక్క అన్ని సమస్యలను తెలియజేసినట్లయితే వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు, వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలియజేశారు. మంత్రి మాట్లాడుతూ అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, రోగులు మరియు పేషెంట్ అటెండెంట్లు మరియు ఆసుపత్రికి వచ్చే ప్రజల కోసం గుర్తించబడిన పార్కింగ్ స్థలాలను మెరుగుపరచాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. అత్యవసర ప్రాంతాల నుండి వార్డులకు ఇతర క్లిష్టమైన ప్రాంతాలకు ట్రాలీలు, వీల్‌చైర్‌ల కదలిక కోసం ప్రత్యేకంగా అంతర్గత రోడ్లను మెరుగుపరచడానికి సూచనలు జారీ చేశారు. ఆసుపత్రిలోకి రావడానికి 2వ గేట్‌ను తెరవడానికి, దానిని త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి, వాహనాలు మరియు రోగుల స్వేచ్ఛా ప్రవాహానికి లోపలికి మరియు బయటికి ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అన్ని ప్రాంతాలలో అన్ని సిసిటివి కెమెరాలు పనిచేస్తున్నాయని నిర్ధారించుకోవడానికి మరియు క్లిష్టమైన ప్రాంతాలలో అవసరమైతే కొనుగోలు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ సిటి స్కాన్ యంత్రాలను ఉపయోగించుకోవాలని, అన్ని ఐసీయూలు, ఓటీలు వెంటిలేటర్లు వంటి క్లిష్టమైన పరికరాలలో యుపిఎస్/జనరేటర్/ఇన్వర్టర్ సౌకర్యం/కనెక్షన్ ఉండేలా చూడాలని అన్నారు.

సీఎంఎస్ మోడ్‌లో విద్యుత్ పరికరాలు, ఏసీలు, జనరేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో మరిన్ని విద్యుత్ పరికరాల నిర్వహణ ఉన్నందున వెంటనే ఏఈని నియమించాలని జెడ్పీ సీఈఓ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈతో మాట్లాడి ఆదేశించారు. అన్ని ప్రాంతాలలో ఆసుపత్రిలో ప్రాధాన్యతా ప్రాతిపదికన ఆక్సిజన్ పైపులైన్ల నిర్వహణను నిర్ధారించాలని, ఏదైనా లీకేజీ నోటీసు ఉంటే సరిదిద్దడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎం.సి.హెచ్ బ్లాక్‌లో కఠినమైన సందర్శకుల విధానాన్ని ప్రారంభించాలన్నారు. సాధారణ మరియు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ యొక్క కఠినమైన వ్యర్థాల నిర్వహణ సరిగ్గా చేయాలన్నారు. ఆసుపత్రిలో అగ్నిమాపక భద్రతా పరికరాలు అందుబాటులో ఉన్నాయని నిర్ధారించుకోవడానికి మరియు జిల్లా అగ్నిమాపక అధికారితో గ్యాప్ విశ్లేషణ తీసుకోవడానికి మరియు ఛార్జీల భద్రతపై అన్ని భద్రతా సిబ్బందికి శిక్షణ పొందేలా చూడాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు, పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్లోని లేఔట్ ప్రకారం ప్రణాళిక బద్ధంగా మొక్కలను నాటేలా చర్యలు తీసుకోవాలని అర్టికల్చర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి డిజిటలైజేషన్ తరువాయి 4లో..

### పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన

## గడువులోపు అనుమతులు మంజూరు చేయాలి

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతం కావాలి
ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





**కర్నూలు, పెన్ పవర్ మే 30 :** పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువు లోపు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులకు అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు... పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు సంబంధించి 09 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వీటికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఈ ఈ ని ఆదేశించారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని కలెక్టర్ ఆరా తీశారు. ల్యాండ్ లెవెలింగ్, ముళ్ళ పొదల తొలగింపు పూర్తయిందని, సోమవారం మెటీరియల్ వస్తోందని ఏపీఎంఐపీ పిడి కలెక్టర్ కు వివరించారు. ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు దేవనకొండ మండలం ఈదుల దేవర బండ గ్రామంలో 10 ఎకరాలను కేటాయించడం జరిగిందని, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇందులో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేయడం జరుగు తోందని, ఇందుకు సంబంధించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు. బనవాసి టెక్స్టైల్ తరువాయి 4లో..

# శెట్టిపల్లి భూములకు త్వరలో మహర్దశ

- సమస్యను పరిష్కరించి యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేస్తాం - ఎన్నో ఏళ్లుగా రైతులు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు
- అందరి సహకారంతో కనీవిని ఎరుగని రీతిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం - తుడా చైర్మన్ డాక్టర్ సి.దివాకర్ రెడ్డి హామీ



**తిరుపతి/శెట్టిపల్లి/పెన్ పవర్ /మే 30 :** గత కొన్ని ఏళ్ల గా పరిష్కారానికి నోచుకోని శెట్టి పల్లె భూములకు మహర్దశ వస్తుందని తుడా చైర్మన్ డాక్టర్ సి దివాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం శెట్టిపల్లె భూములను ఆయన తుడా ఉపాధ్యక్షురాలు మౌర్య, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది ఏళ్లుగా శెట్టిపల్లె భూముల సమస్య పరిష్కారం కాకుండా రైతులు, సామాన్య ప్రజలు ఎన్నో ఇబ్బందులు గురయ్యారని తెలిపారు. ప్రజల సహకారముతో త్వరలో సమస్యను పరిష్కరించి యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు, కొనుగోలు చేసిన ప్రజలకు సైట్లు ఎక్కడ ఇవ్వాలని అంశంపై చర్చిస్తున్నామని చిన్నచిన్న సమస్యలు సర్దుకుని ప్రజలు సహకరించాలని కోరారు. ఇంత త్వరగా అభివృద్ధి చేశారా అని ప్రజలు ఆశ్చర్యపోయే విధంగా తుడా ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్‌తో పాటు తుడా సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, తాహాసిల్దార్ భాగ్యలక్ష్మి, తుడా అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రసిద్ధ ఒంటిమిట్ట దేవాలయ ప్రాంగణంలో యోగాభ్యాసం

### - 676 మందితో యోగాసనాలు

**వైయస్సార్ కడప , పెన్ పవర్ మే 30 :** యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు అన్నారు. శుక్రవారం యోగాంధ్ర 2025లో భాగంగా, "ఒకే భూమి, ఒకే ఆరోగ్యం" అనే నినాదంతో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశమైన ఒంటిమిట్ట దేవాలయ ప్రాంగణంలోని దక్షిణ ద్వారము ఉద్యానవనంలో యోగాభ్యాసంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ.. ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా వీటిని దూరం చేయొచ్చన్నారు. వచ్చే నెల 21వ తేదీ వరకు యోగపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని.. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న మాసోత్సవాల్లో భాగంగా.. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర - 2025 కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందన్నారు. రోజూ ఒక గంట సాధన చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ శిక్షణలో 676 మంది వరకు పాల్గొని సాధన చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన యోగాంధ్ర క్యాంపియన్ ఫోటో ఆర్చ్ వద్ద ఉత్సాహంగా పలువురు సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్టీవో జాన్ ఇర్విన్, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపిఓ రాజ్యలక్ష్మి, డిఎం అండ్ హెచ్ ఓ నాగరాజు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, డి ఎస్ డి ఓ జనార్ధన రెడ్డి, ఆయుష్ ఇన్స్పెక్టర్ మురళి బాబు, జిల్లా పర్యాటక ఇన్చార్జి అధికారి సురేష్ కుమార్, డీవీఎం మల్లికార్జున గౌడ్, మండల అధికారులు,పర్యాటక అధికారులు,యోగ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.



## జూన్ నెలలో తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో విశేష ఉత్సవాలు...





**తిరుపతి పెన్ పవర్ మే 30 :** జూన్ 02 నుంచి 10 వరకు శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, బ్రహ్మోత్సవాలకు జూన్ 01వ తేదీ సాయంత్రం అంకురార్పణం, జూన్ 20, జూన్ 27 తేదీలలో సాయంత్రం 06 గం.లకు శ్రీ ఆండాళ్ అమ్మవారు/శ్రీ పుండరీకవల్లి అమ్మవారి ఊరేగింపు. జూన్ 24న రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీపార్థసారథిస్వామివారు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. మే 31 నుండి జూన్ 9వ తేదీ వరకు నమ్మాళ్వార్ ఉత్సవం.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు



**నంద్యాల, పెన్ మే 30 :** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెన్యువల్ చేసిన అక్రిడేషన్ కాల పరిమితి మే 31వ తేదీ నాటికి ముగుస్తున్న నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు.

## ఎస్వీబీసీ అభివృద్ధిపై సమీక్షా సమావేశం



**తిరుమల పెన్ పవర్ మే 30 :** శ్రీవేంకటేశ్వర భక్తి ఛానెల్లో ప్రసారమౌతున్న కార్యక్రమాల నాణ్యత, అభివృద్ధిపై శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఈవో జె.శ్యామలరావు కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ ఎస్వీబీసీలో మరింత నాణ్యమైన కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు. శ్రీవారి భక్తులను ఆకట్టుకునే విధంగా కార్యక్రమాలకు రూప కల్పన చేయాలని తద్వారా వీక్షకుల సంఖ్య పెంచ వచ్చునని తెలిపారు. ఈవో మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నాణ్యమైన ప్రమాణాలతో రూపొందించడంతో పాటు యువతకు చేరువయ్యేలా కార్యక్రమాలు ప్రసారం చేయాలని తెలియజేశారు. అంతకు మునుపు సాంకేతిక మరియు కంటెంట్ నిపుణులు శ్రీనివాసరెడ్డి, రవి కుమార్, శ్రీనివాస్ ఎస్వీబీసీ కార్యక్రమాల ప్రమాణాలను మరింత ఆకర్షణీయంగా తీర్చి దిద్దేలా పలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓ మరియు సీఈఓ ఎస్వీబీసీ ఇంచార్జి వీరబ్రహ్మం, ఎస్వీబీసీ ఓఎస్డీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ కార్మిక వర్గ కష్టాలు తీర్చేది సిఐటియు జెండానే



**పలమనేరు మే 30, (పెన్ పవర్) :** భారతదేశంలో ఉన్న అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై పోరాటం చేసి వారి కష్టాలు తీర్చేది సిఐటియు జెండానే అని సిఐటియు మండల కార్యదర్శి సావిత్రి అన్నారు. శుక్రవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయం ముందు జెండా ఆవిష్కరించారు,ఈ సందర్భంగా సిఐటి జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా మాట్లాడుతూ.. సిఐటియు 1970లో ఆవిర్భవించిందని నాటి నుంచి నేటి వరకు అవిశ్రాంత పోరాటాలు నిర్వహిస్తూ,కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా ఉంటూ పదుల సంఖ్యలో కార్మిక చట్టాలు సాధించుకుని కార్మికులకు రక్షణ కవచంగా సిఐటియు నిలిచిందని అన్నారు.భారతదేశ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికుల కనీస వేతనం కోసం, కార్మిక హక్కుల కోసం,వారి రక్షణ కోసం,నిత్యం కార్మికులతో మమేకమవుతూ, ఐక్యం చేస్తూ, పోరాటాలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు, మే నెల అంటేనే కార్మికుల నెలగా కార్మికులంతా గుర్తుపెట్టు కోవాలని మే మొదటి తారీకు ఎర్రజెండా పుడితే భారతదేశంలో మే 30 తేదీన సిఐటియు ఆవిర్భవించింది అన్నారు. కార్మికులలో కుల, మత ప్రాంత భేదాలు లేకుండా దేశసమైక్యత నింపుతూ,కార్మిక వర్గరాజ్య స్థాపన లక్ష్యంగా,కార్మిక వర్గ కష్టాల విముక్తి ధ్యేయంగా సిఐటియు పోరాటాలు చేస్తుందని ఆయన కొనియాడారు, దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 లేబర్ చట్టాలు రద్దు చేసి,నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని ఇవి కార్మికులకు ఉరితాడుగా మారినాయని వాపోయారు, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు,44 లేబర్ చట్టాల అమలుకై జులై 9వ తేదీ దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, అనంతరం కార్మికులందరికీ సిఐటియు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి.ఆశ వర్కర్స్ కైరున్నిసా, ధనమ్మ,బిల్డింగ్ కార్మికుడు ప్రతాప్, రవి తదితర కార్మికులు పాల్గొన్నారు.

# యోగ చేస్తే ఎలాంటి మెడికల్ ఖర్చు ఉండదు

**జిల్లాలో ఆరు యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము - ప్రజలు అందరు యోగ కార్యక్రమంలో పాల్గొనాలి - సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగ చేయాలి : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**




**చిత్తూరు, పెన్ పవర్ మే 30 :** సమయం ఉన్నపుడు ప్రతి ఒక్కరు యోగ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉత్సవాలలో బాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫ్రీ మెగా యోగ కార్యక్రమం శుక్రవారం ఉదయం స్థానిక పోలీసు శిక్షణ మైదానం నందు 4 వేల మందితో నిర్వహించిన యోగ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,జిల్లా అటవీ శాఖ అధికారిణి భరణి,జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ సుధారాణి ముఖ్య అతిథిదులుగా పాల్గొన్నారు. యోగ కార్యక్రమం అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో 4 వేల మంది యోగాసనాలు చేయడం జరిగిందని తెలిపారు. సమయం ఉన్నపుడు ప్రతి ఒక్కరు యోగ చేయడంవల్ల ఎలాంటి మెడికల్ ఖర్చులు ఉండవని తెలిపారు. మే 21 నుండి జూన్ 21 వరకు యోగ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేశారని,జిల్లాలో ఆరు యోగ కార్యక్రమాలు నిర్వయించాలని ప్రభుత్వం ఆదేశించియున్నారని, అందులో భాగంగా జిల్లా లో ఇప్పటికే రెండు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పెనుమూరు మండలం,పులిగుండు,చౌడేపల్లి మండలం, బోయకొండ, కుప్పం నియోజకవర్గంలో ననియాల, కంగుంది పోర్టు నందు యోగ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.జూన్ ఒకటి నుండి జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 500 మందికి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇప్పించడం జరిగిందని వీరి ద్వారా జిల్లాలో 6 వేల మందికి శిక్షణ ఇప్పించి జూన్ ఒకటి నుండి జూన్ 20 వరకు ప్రతి మండలంలోనూ గ్రామంలోనూ యోగా గురించి పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేయడమేమనగా సమయం ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ యోగ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని, ఎలాంటి మెడికల్ ఖర్చు ఉందని తెలిపారు.

యోగ గురించి పూర్తి అవగాహన చేసుకొని యోగ ప్రాణాయామం చేయడం వల్ల ప్రశాంతత,ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా, శ్వాస పెరుగుతుందని అందుకోసం ప్రతి ఒక్కరు ప్రతి రోజు యోగ చేసుకోవాలని చూచించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి యోగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ.కె.మోహన్ కుమార్,ఆర్డీ ఓ.భవాని, జడ్పీ సి ఈ ఓ.రవి కుమార్ నాయుడు,సిపి ఓ.సాంబశివ రెడ్డి,ఉద్యాన శాఖ డి డి.మధుసూదన్ రెడ్డి,జిల్లా పర్యాటక శాఖ అధికారిణి గౌరి,జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి, మెప్మా పి.డి.రాధమ్మ,డ్వామా ఏపి డి.మల్లి ఖార్జున,డి యల్‌డి ఓ.రవి కుమార్,స్త్రీ శు సంక్షేమ శాఖ పిడి.వెంకటేశ్వరి,దేవాదాయశాఖ సహాయం కమిషనర్ చిట్టెమ్మ, యోగ గురువు శ్రీనివాసులు నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం ప్రజల పక్షాన నిలిచిన మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వం

**38వ, 39వ వార్డుల్లో ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించిన.. - ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం : హరీష్ బాబు**





**ధర్మవరం, పెన్ పవర్ మే 30 :** ధర్మవరం పట్టణంలోని 38వ వార్డు, 39వ వార్డు, తారకరామపురం ప్రాంతాల్లో తలెత్తుతున్న ప్రజా సమస్యలపై మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు చొరవగా స్పందించారు. గురువారం ఉదయం, ఈ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎన్డీయే కార్యాలయాన్ని సందర్శించి తమ భౌతిక సమస్యలను ఆరోగ్యశాఖ మంత్రి నాయకత్వానికి తెలియజేశారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థలో ఉన్న లోపాలు, పాడైన రహదారులు, నిరంతర విద్యుత్ అంతరాయాలు వంటి సమస్యలను వారు ప్రస్తావించారు. ప్రజల వినతులను స్వీకరించిన హరీష్ బాబు , శు క్రవారం ఉదయం స్వయంగా 38వ వార్డు, 39వ వార్డు మరియు తారకరామపురం ప్రాంతాలకు వెళ్లి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరిశీలన అనంతరం హరీష్ బాబు సంబంధిత అధికారులతో తక్షణమే మాట్లాడి, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ వంటి అంశాల్లో త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకునేలా చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను సీరియస్‌గా పరిగణనలోకి తీసుకుంటామని, ధర్మవరం పట్టణాభివృద్ధిలో మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తారని ఆయన హామీ ఇచ్చారు. ఇలాంటి సమస్యలపై ప్రజలు భయపడకుండా ఎన్డీఏ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. ప్రజల అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలే మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి మొదటి ప్రాధాన్యత అని ఈ సందర్భంగా హరీష్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కార్యాలయ సిబ్బంది, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, జూటూరు వెంకటేష్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అహల్యాబాయ్ హెూల్కర్ త్రిశతాబ్ది జయంతి


**బీజేపీ సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టే కార్యక్రమాల్లో అహల్యాబాయ్ జయంతి ముందుండాలి - మాజీ ఎమ్మెల్సీ మాధవ్**





**ధర్మవరం పెన్ పవర్ మే 30 :** ధర్మవరం బిజెపి ఆధ్వర్యంలో పుణ్య శ్లోక అహల్య బాయ్ హెూల్గర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తోలుత పట్టణంలోని గాంధీనగర్ చౌడమ్మ దేవాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, కళా జ్యోతి సర్కిల్, గర్ల్స్ హై స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ, పుణ్య శ్లోక అహల్య బాయ్ హెూల్గర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా ముఖ్యంగా పట్టణాలతో పాటు ముఖ్యంగా దేవాలయాల్లో ఆవిడకు ఇవాళ అర్పించే కార్యక్రమంతో పాటు అహల్య బాయ్ నిర్మించిన శ్రీశైలం పుణ్యక్షేత్రంలో కూడా కార్యక్రమం ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమానికి మంత్రి సత్య కుమార్ కూడా పాల్గొంటారని తెలిపారు.అలాగే చతిస్గడ్ ముఖ్యమంత్రి రాజమండ్రిలో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నామని అదేవిధంగా అహల్య బాయ్ హెూల్గర్ అంటే ఒక సుపరిపాలనే కాదు ఈ దేశంలో ఆధ్యాత్మిక వైభవాన్ని భారతదేశ ఆత్మని పున ప్రతిష్ట చేసిన దిశాలి అని ఆవిడ ఒక మాతృమూర్తి ఆవిడ ఒక పవిత్రమైన జీవితం ప్రజల్లోకి తీసుకెళ్లి గొప్ప పని స్వయంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకెళు న్నారని తెలిపారు. అనంతరం మంత్రి నియోజకవర్గం ఇంచార్జ్ హరీష్ బాబు గారు మాట్లాడుతూ %-%అహల్యాబాయ్ హెూల్కర్ భారత దేశపు గొప్ప మహిళా పాలకులలో ఒకరు. ఆమె పరిపాలన సమర్థత, ధర్మపరమైన దృక్పథం, ప్రజా సేవ పట్ల ఉన్న నిబద్ధత భవిష్యత్ తరాలకు ఆదర్శం. మహిళా సాధికారతకు ఆమె ప్రవేశపెట్టిన మార్గం, నేటికీ సమకాలీన ప్రపంచానికి పాఠం చెబుతోంది. బీజేపీ పార్టీ చరిత్రను, సంస్కృతిని, ధర్మాన్ని గౌరవించే సంస్థగా నిలుస్తూ, ఇలాంటి మహనీయుల జయంతులను పురస్కరించుకుని యువతకు స్ఫూర్తి నింపే కార్యక్రమాలను నిర్వహిస్తోంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉత్తమ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బూదిలి సుదర్శన్, అనంతపురం మాజీ అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాసులు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేష్, బత్తలపల్లి మండల అధ్యక్షులు భాస్కర్, తాడిమర్రి మండల అధ్యక్షులు రాము, ముదిగుబ్బ మండల అధ్యక్షులు అంజన్ రెడ్డి, మహిళా మోర్చా నాయకులు, యువమోర్చా సభ్యులు, పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులు అరెస్టు.. 4కేజీల గంజాయి స్వాధీనం





**పలమనేరు మే 30, (పెన్ పవర్) :** గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు డిఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. ఈమేరకుశుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని గంగవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజేంద్ర,సంబార్ పూరుకు చెందిన మోహన్,పలమనేరు కు చెందిన మంజునాథ్,కిషోర్ కుమార్ లను పలమనేరు-చిత్తూరు రోడ్డు, గంటావూరు ఫ్లైఓవర్ వద్ద గంజాయిని అమ్ముతున్నారనే సమాచారంపై పలమనేరు డిప్యూటీ తహసిల్దార్,సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ స్వర్ణతేజ మరియు పోలీసు సిబ్బందితో కలిసి,గంజాయితో ఉన్న నలుగురు వ్యక్తులను పట్టు కొని, ముద్దాయిల వద్దనున్న సుమారు నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నా మన్నారు. అనంతరం ముద్దాయిలను రిమాండ్ కు తరలించడం జరుగుతుందని, కానీ ఎవరైనా గంజాయి గాని, లాటరీ టికెట్లుగాని మరియు కర్నాటక రాష్ట్రానికి చెందిన మధ్యంను అమ్మకూడదని, అలా అమ్మినట్లయితే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని ఆయన అన్నారు. పలమనేరు టౌన్‌లో ఎవరైన గంజాయిని,లాటరీ టికెట్లను మరియు కర్నాటక రాష్ట్రానికి చెందిన మధ్యంను అమ్ముతున్నట్లు మీ దృష్టికి వచ్చిన యెడల వెంటనే పోలీసులకు సమాచారం అందించిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

### నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో వర్షాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి




**(3వ పేజీ తరువాయి)** తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక వైపు వర్ష కాలం వస్తున్నది మంచి విషయమే అయినప్పటికీ కాని, దాని వలన వచ్చే ఉరుములు, మెరుపులు వలన ప్రాణ నష్టం జరుగుతుందని తెలిపారు. అలాగే పశువులకు కూడా అలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్నవారికి వర్షాలు ఎక్కువగా రానున్నరీత్యా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ఆహార పదార్థాలు, త్రాగు నీరు, మౌలిక సదుపాయాలను సంబందిత అధికారులు కల్పించాలని ఆదేశించారు. వర్షాలు రానున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డివిజన్ స్థాయిలో ఆర్డిఓలు, మండల స్థాయిలో తహసీల్దార్‌లు, ఎంపిడిఓలు, గ్రామ స్థాయిలో పంచాయతీ అధికారులు ఎలాంటి విపత్తులు జరగకుండా పూర్తి బాద్యత తీసుకోవాలన్నారు. వర్షా కాలంలో పాఠశాలలు ప్రారంభవుతున్న సందర్భంగా పాత బడిన సంక్షేమ వసతి గృహాలలో వున్నా మరమ్మతులను అన్నిటిని పూర్తి చేసిన తరువాత పిల్లలను అందులో ఉండేటట్లు చూడాలని సంక్షేమ వసతి గృహాల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ లు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట తిరుపతి, భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, రాంమోహన్, తిరుపతి డిఎస్పి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమీషనర్ లు, డిపిఓ సుశీలా దేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో, డిఎంహెచ్ఓ,సీపీఓ, ఇరిగేషన్, హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు, ఎస్సీ బీసీ ఎస్టీ ఐసిడిఎస్ వెల్ఫేర్ అధికారులు, ఫైర్, మత్స్యశాఖ, తాసిల్దార్లు, ఎంపీడీవోలు,సంబందిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువులోపు అనుమతులు మంజూరు చేయాలి

**(3వ పేజీ తరువాయి)** పార్కులో త్వరితగతిన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు..అలాగే మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇండస్ట్రీస్ జిఎం ను ఆదేశించారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కి నీటి సరఫరా పైపు లైన్ నిర్మాణపు పనులు ఎంత వరకు వచ్చాయని ఏపీఐఐసీ జడ్ఎం ను అడిగి తెలుసుకున్నారు.. 70 శాతం పూర్తి అయ్యాయని జడ్ఎం కలెక్టర్ కు వివరించారు.. జూలై లోపు పైప్ లైన్ నిర్మాణపు పనులు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు...దూపాడు - బేతంచెర్ల రైల్వే లైన్ ఏర్పాట్లు భూసేకరణ చేయాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు.. రైల్వే లైన్, నీటి పైప్ లైన్, ఎయిర్ పోర్టు లు పరిశ్రమలకు కనెక్ట్ అయితే అభివృద్ధి వేగవంతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జైరాజ్ ఇస్పాత్, జియో మైసూర్, గ్రీన్ కో తదితర కంపెనీ ల ద్వారా స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జిఎం ను ఆదేశించారు.. ఇందుకు సంబంధించి వారితో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథ కానికి సంబంధించి 2135 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపడం జరిగిందని, వీటి మంజూరు ప్రగతికి సంబంధించి చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇండస్ట్రీస్ జిఎం ను ఆదేశించారు..కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నీటి సరఫరాకు సంబంధించి ఎస్టిమేట్స్ వేయించాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు..

**రూ.1.61 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం :**

పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 24 క్లెయిమ్ లకు రూ.1.61 కోట్లకు ఆమోదం తెలపడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ క్రింద 17 క్లెయిమ్స్ కు రూ. 1,57,50,166/- , వడ్డీ రాయితీ కింద ఒక క్లెయిమ్ కు రూ. 13,813/- , విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ క్రింద ఒక క్లెయిమ్ కు సంబంధించి రూ 36,663/-, సేల్స్ టాక్స్ రీయింబర్స్‌మెంట్ క్రింద 5 క్లెయిమ్స్ కు సంబంధించి రూ.3,35,265/- లు పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కేటగిరీల వారీగా జనరల్ కేటగిరీ లకు 7, ఎస్సీ లకు 15, ఎస్టిలకు 2 మొత్తంగా 24 మందికి ప్రోత్సాహ కాలు మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్చార్జి జిఎం అరుణ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఏపీ ఎంఐపీ పిడి ఉమా దేవి,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ ఈ కిషోర్ కుమార్ రెడ్డి, ఐలా ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్ర నాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలి

**(3వ పేజీ తరువాయి)** ఓపీ ఐపీ, ఫార్మసీ, డయాగ్నోసిస్ మరియు డిశ్చార్జ్ సారాంశం వంటి ఆసుపత్రి డిజిటలైజేషన్‌ను మెరుగుపరచడానికి మరియు అధునాతన సాఫ్ట్‌వేర్‌లను స్వీకరించడం ద్వారా సంవత్సరం చివరి నాటికి దానిని పూర్తిగా కాగితరహితంగా మార్చాలన్నారు, ఏదైనా పోస్టులు ఖాళీగా ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలను భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వ్యర్థ ఇనుప స్క్రాప్‌ను వెంటనే ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ కే వెంకటేశ్వర్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు, ఆర్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్ గోవింద్ వాహనాలు తనిఖీ



**శ్రీ కాళహస్తి / పెన్ పవర్/ ప్రతినిధి/ మే 30 :** శ్రీకాళహస్తి వన్ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐగా సీహెచ్ గోవింద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ట్రాఫిక్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని పెళ్లి మండపం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, సంబంధిత పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం : డిఎం అండ్ హెచ్ ఓ డా.ఈ బి దేవి

## నగరంలోని హౌసింగ్ బోర్డు అభయ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం 10వ రోజు నిర్వహణ







**అనంతపురం, పెన్ పవర్ మే 30 :** నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డిఎం అండ్ హెచ్ ఓ డా.ఈ బి దేవి తెలిపారు. శుక్రవారం ఉదయం అనంతపురం నగరము హౌసింగ్ బోర్డు లోని అభయాంజనేయ దేవాలయం ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డియంహెచ్ ఓ,హౌసింగ్ పిడి శైలజ, ఆయుష్ అధికారులు డా.రామ్ కుమార్, డా.భాస్కర్, డా లాల్యా నాయక్, యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజా, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్ ,వైద్య మరియు హౌసింగ్ శాఖల అధికారులు, పతాంజలి సంస్థ రవి కుమార్, వారి సిబ్బంది, వివేకానంద సంస్థ రాజశేఖర్ రెడ్డి, బ్రహ్మకుమారీ శారద, హౌసింగ్ బోర్డు ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు.

ఈ సందర్భంగా డి యం హెచ్ ఓ మాట్లాడుతూ నగర ప్రజలు అందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలందరూ యోగ చేయడం వల్ల ఎంతటి రోగాలనైనా మన శరీరం తట్టుకుంటుందని, మనమందరం ఆరోగ్యంగా ఉండి మన కుటుంబాన్ని పోషించుకోగల మనో ధైర్యం, సంకల్పం ఇలాంటి యోగాతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఉదయం గంట సేపు మన శరీరాన్ని యోగ వైపు మరలించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కి, అలాగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ కి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యోగ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వార్తా విలేకరి మెహర్ హఠాన్మరణం



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్ /ప్రతినిధి /మే 30 :** వార్తా దినపత్రిక తొట్టంబేడు మండల విలేకరి చిట్టత్తూరు మెహర్ కుమార్(45) శుక్రవారం హఠాన్మరణం చెందారు. ఆయన మృతి పట్ల శ్రీకాళహస్తి పాత్రికేయులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కొండమిట్టలోని నివాసానికి వెళ్లి మెహర్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. 26 ఏళ్ల పాత్రికేయ ప్రస్థానంలో మెహర్ కుమార్ తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరుచుకున్నారు. నిబద్ధత, నిజాయితీ కలిగిన పాత్రికేయుడిగా మెహర్ సమాజంలోని వెతలపై అలుపెరగని అక్షర పోరాటం చేశారు. వివాద రహితుడు మెహర్ కుమార్ అర్ధాంతరంగా తనువు చాలించడంతో పాత్రికేయ లోకం విచారంలో మునిగిపోయింది. చిరకాల మిత్రుడిని అశ్రునయనాల మధ్య కడదాకా సాగనంపి వచ్చారు. మెహర్ అంత్యక్రియల్లో శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎం.వేణుగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి ధనశేఖర్, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## జూనియర్ సహాయకులుగా పదోన్నతులు



**అనంతపురం పెన్ పవర్ మే 30 :** స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని, చైర్ పర్సన్ చాంబర్ నందు, జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఐదుగురు ల్యాబ్ అసిస్టెంట్లు మరియు ఒకరు రికార్డ్ అసిస్టెంట్ మొత్తం ఆరుమందికి జూనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ, కే.భీమయ్య-జడ్పీ.హెచ్.యస్ గుమ్మగట్ట, యస్.ఫక్రుద్దీన్-జడ్పీ.హెచ్.యస్ సిద్దరాంపురం, యస్.లక్ష్మన్న - జడ్పీ.హెచ్.యస్ నాగసముద్రం, పి.సాదభాష-జడ్పీ.హెచ్.యస్ తొగర తకుంట, యం. హరికృష్ణ - జడ్పీ.హెచ్.యస్ (బాయ్స్) ముదిగుబ్బ మరియు బి.వెంకటేశులు- జడ్పీ.హెచ్.యస్ (గర్ల్స్)కళ్యాణదుర్గం నకు నియమిస్తూ పదోన్నతుల ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన ఉద్యోగులు జిల్లా ప్రజా పరిషత్ కు మంచి పేరు తీసుకువచ్చేలా మరింత భాధ్యతగా ప్రజలకు సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఇంచార్జి ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త సేకరణపై సూక్ష్మస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశాం

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి





**అనంతపురం, పెన్ పవర్ మే 30 :** ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించే విషయంపై సూక్ష్మస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు.శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండియోగాంధ్ర 2025 క్యాం పెయిన్, పీఎం సూర్య ఘర్, సానుకూల ప్రజా అవగాహన తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. సీఎస్ విసి లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించే విషయంపై సూక్ష్మస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ అంశంలో డి.పి.ఓ,మునిసిపల్ కమిషనర్లతో ప్రత్యేకంగా సమీక్షించామని రెండు వారాల నుంచి ప్రత్యేక డ్రైవ్ ను కూడా చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఓ ఏ.మాలోల,మున్సిపల్ కమిషనర్ బాలస్వామి,డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, టూరిజం అధికారి జయ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కడప పురుషుల ,ప్రత్యేక మహిళ కారాగారాం, రాయచోటి సబ్ జైలుల ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల తనిఖీ





**కడప పెన్ పవర్ మే 30 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప. డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కడప పురుషుల కేంద్ర కారాగారము, ప్రత్యేక మహిళ కారాగారాము, రాయచోటి సబ్ జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ / తనిఖీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి, మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీలతో మాట్లాడడం జరిగినది, సకాలంలో డాక్టర్ సలహాలు తీసుకుంటూ మందులు వాడాలి, ఫిర్యాదుల పెట్టెను పరిశీలించడం జరిగినది, ప్రిజం లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము మొదలగు అంశాలను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారము సూపరిండెంట్, ప్రత్యేక మహిళ కారాగారము సూపరిండెంట్, రాయచోటి సబ్ జైల్ సూపరిండెంట్, పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## బాల కార్మికుల గుర్తింపు కొరకు ప్రత్యేక తనిఖీ డ్రైవ్...



**తిరుపతి పెన్ పవర్ మే 30 :** బాల కార్మికులను గుర్తించి బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఆదేశించారు. బాల కార్మికులను గుర్తించి బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ మరియు విద్యా శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ కార్మిక శాఖ విద్యాశాఖ, తదితర శాఖలతో, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బాల కార్మికుల గుర్తింపునకు తీసుకోవలసిన చర్యలపై, స్పెషల్ డ్రైవ్ నిర్వహణ, వారి రిహబిలిటేషన్ అంశాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1 నుండి 30వ తేదీ వరకు బాల కార్మికుల గుర్తింపు కొరకు ప్రత్యేక తనిఖీ డ్రైవ్ లను నిర్వహించాలని ఆదేశించిందని, ఆ మేరకు కార్మిక శాఖ, విద్యా శాఖ తదితర అధికారుల టాస్క్ ఫోర్స్ బృందం మన జిల్లాలో జూన్ 1 నుండి 30వ తేదీ వరకు బాల కార్మికుల గుర్తింపు కొరకు ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ అనేది సమాజంలో ఒక సామాజిక సమస్య అని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖలు కార్మిక శాఖ, విద్యాశాఖ, ఎస్ ఎస్ ఎ, స్త్రీ మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు ముఖ్య భూమిక పోషించాలని అన్నారు. జిల్లాలో ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, ఆటోనగర్, ఇటుకల బట్టీలు, దుకాణాలు, హోటల్ లలో తదితర ప్రాంతాలలో బాల కార్మికులను స్పెషల్ స్క్వాడ్ లు తనిఖీ చేసి బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి, సదరు పిల్లలను విద్యాశాఖ ద్వారా వారి విద్యా స్థాయిని బట్టి సంబంధిత పాఠశాలలో, అవసరైన వారికి బ్రిడ్జి ఎడ్యుకేషన్ అందిస్తూ వారికి వసతి సౌకర్యాలను కల్పించాలన్నారు. అదేవిధంగా కార్మిక శాఖ సంబంధిత యజమానులపై బాల కార్మిక నిర్మూలన చట్టం తదితర చట్టాల మేరకు కేసులు నమోదు చేసి చట్ట కరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక తనిఖీలో భాగంగా తనిఖీ బృంద సభ్యులు బాతుల పెంపకం దారులపై ప్రత్యేక దృష్టి సారించి బాల కార్మికులను గుర్తించి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం కార్మిక శాఖకు సంబంధించిన బాల కార్మిక నిషేధ చట్టం గోడపత్రికలను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇంచార్జి ఉప కార్మిక కమిషనర్ ఓంకార రావు, సహాయ కమిషనర్ చిన్నలాలప్ప, డీఎస్పీ శ్రీలత, డి ఎం హెచ్ ఓ బాలాజీ నాయక్, డిఈఓ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని వసంత బాయి, సహాయ కార్మిక అధికారులు మరియు ప్రగతి ఎన్జీవో ప్రతినిధులు, పలువురు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్







**కర్నూలు, పెన్ పవర్ మే 30 :** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ నెల 21 నుండి నెల రోజుల పాటు నిర్వహించే యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుండి యోగాంధ్ర - 2025, పీఎం సూర్య ఘర్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికై ఈ నెల 21న ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని మంచి స్ఫూర్తితో ముందుకు తీసుకు వెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు అంతా సమిష్టిగా ముందుకు అడుగులు వేయాలన్నారు. విశాఖపట్నం వేదికగా జూన్ 21 న జరుగనున్న 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ పాల్గొంటున్న సందర్భంగా ప్రపంచానికి యోగ విశిష్టతను తెలియపర్చే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామంలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రజలు అందరూ యోగా అనేది ఒక జీవిత విధానంగా అనుసరించేలా ఈ శిక్షణా కార్యక్రమాలు జరిగే విధంగా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ల ను ఆదేశించారు.ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క థీమ్ తో 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి జిల్లా కలెక్టర్ అందరికి కమ్యూనికేట్ చేయడం జరిగిందని, ఆ కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలుపరచాలని ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలు వేగవంతం చేయాలని సిఎస్ ఆదేశించారు.. వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు..

## యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్ వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలి

### - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, పెన్ పవర్ మే 30 :** యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్ వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ ను తనిఖీ చేసి యోగాంధ్ర కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు సంబంధించిన యాప్‌లో త్వరితగతిన అప్డేట్ చేయాలని, రిజిస్ట్రేషన్స్ పెంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, జడ్పి సిఈఓ రామసుబ్బయ్య, డ్రగ్స్ ఏడి రమేష్ రెడ్డి, ఆయుష్ అధికారులు డా.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు తప్పవు

### డిస్కమ్ ప్రధాన కార్యదర్శి అరవ జయమణి పిలుపు




**పలమనేరు మే 30, (పెన్ పవర్) :** సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ పలమనేరు సబ్ డివిజన్ ముఖ్యుల సమావేశం షరీఫ్ అధ్యక్షతన జరిగింది. శుక్రవారం ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ & వర్కర్స్ యూనియన్ హెచ్ 64, (ఏఐటీయూసీ అనుబంధం) డిస్కమ్ ప్రధాన కార్యదర్శి ఆరవ జయమణి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ నాగరాజు లు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ షిఫ్ట్ ఆపరేటర్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయన్నారు. కొంతమంది కార్మికులకు ప్రావిడెంట్ పండ్ పి.ఎఫ్.అమలు చేయడం లేదని వాపోయారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా,ఇంతవరకూ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం సందర్భంగా పలమనేరు సబ్ డివిజన్‌లో 3045 యూనియన్ నుండి ఏఐటీయూసీ లో చేరినందుకు కార్మికులకు డిస్కమ్ ప్రధాన కార్యదర్శి ఆరవ జయమణి అభినందనలు తెలిపారు. ఏఐటీయూసీ సంఘంపై నమ్మకం ఉంచి చేరినందుకు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైన నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలమనేరు ఏఐటీయూసీ నాయకులు సి.చెన్నకేశవులు, బుర్ర మంజునాథ్ బాబు, పుంగనూరు ఏఐటీయూసీ నాయకులు పి.వెంకటరమణా రెడ్డి,కే.రామ్మూర్తిలు పాల్గొని ప్రసంగిస్తూ.. విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, చేస్తున్న న్యాయ పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో షరీఫ్,కార్తికేయన్, రవీంద్ర,వినాయక, ప్రభాకర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలను గుర్తించి ఇంటి స్థలాలను అందిద్దాం

### సమస్యల పరిష్కారంలో జాప్యంవద్దు : ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



**పలమనేరు మే 30, (పెన్ పవర్) :** అర్హులైన పేదలను గుర్తించి ఇంటి స్థలాలను అందిద్దామని, అలాగే ప్రజాసమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి అధికారులకు సూచించారు. పలమనేరు పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం రెవిన్యూ, మున్సిపల్ మరియు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంటావూరు కాలనిలో గుర్తించిన ఇంటిస్థలాల అంశంపై వివరాలు అడిగి తెలుసుకుని త్వరలో అర్హులైన పేదలను గుర్తించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్ ఇన్బనాథన్‌ను ఆదేశించారు.ఇక పట్టణంలోని మదనపల్లి రోడ్డులో డివైడర్ ఏర్పాటుతో పాటు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన విద్యుత్ దీపాల ఏర్పాటుపై కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్థంభాలతో పాటు మెటీరియల్ సిద్ధంగా ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ జాప్యం చేస్తు న్నారని కమిషనర్ వివరించారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఎన్.హెచ్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వెంటనే డివైడర్ ఏర్పాటుతో పాటు విద్యుత్ స్థంబాలు ఏర్పాటయ్యేలా మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా స్థానిక ఆర్టీసీ డిపో నుంచి మార్కెట్ కమిటీ వరకు ఇదే పనులు పెండింగ్ ఉన్నాయని అందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఇక పలమనేరులో ఈ మధ్య కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో తాగునీటి సమస్య తీరినట్టేనని కమిషనర్ ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు కేటిల్ ఫామ్ సమీపంలో ఏర్పాటు చేయదలచిన అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పనులపై ఏఎంసి సెక్రటరీ వి.సంజీవ్ కుమార్‌తో ఆయన సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో రెవిన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్కంటీశ్వరుడి సేవలో చిలకలూరిపేట ఎమ్మెల్యే



**శ్రీకాళహస్తి/పెన్ పవర్/ప్రతినిధి/మే 30 :** శ్రీకాళహస్తీశ్వర దేవస్థానానికి చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు వచ్చారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు కల్పించారు. శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుడిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శ్రీమృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేద పండితుల ఆశీర్వచనంతో తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఒకరోజు ముందుగానే జూన్ నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ



**చిత్తూరు, పెన్ పవర్ మే 30 :** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్ లకు సంబంధించి జూన్ నెల పెన్షన్లు ఒకరోజు ముందుగానే అనగా మే 31న పెన్షన్ లబ్ధి దారులకు పంపిణీ చేయడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ మే 31వ ఉ.6.30 గం.ల నుంచి లబ్ధి దారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయాలని,అదే రోజు 100 శాతం ఫించన్ల పంపిణీ చేయాలని ఎంపీడిఓలు, మున్సిపల్ కమిషనర్లు ఈ పంపిణీ ని పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.జూన్ నెలకు సంబంధించి 2,63,776 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్ దారులకు రూ.112.73 కోట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మే 31 వ తేదీన ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ ఏ కారణం చేతనైనా జరగని పింఛనుదారులకు జూన్ 02 వ తేదీ మ.2.గం.ల నుండి సా. 5 గం.ల వరకు గ్రామ/వార్డు సచివాలయంలో సంబంధిత సచివాలయ సిబ్బంది వీరికి పించను మొతాన్ని తప్పనిసరిగా పంపిణి చేయాలని తెలిపారు.

## ఎమ్మెల్యేను కలసిన చిత్తూరు డిసిసిబీ చైర్మన్



**పలమనేరు మే 30, (పెన్ పవర్) :** శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని చిత్తూరు జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. డిసిసిబీ చైర్మన్ గా నియమితులు కావడంతో ఆయన సీఈవో సి.శంకర్ బాబుతో కలసి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అమరనాథ రెడ్డిని కలసి ధన్యవాదాలు తెలియజేస్తూ పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించారు. త్వరలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ సిబ్బంది గంగిరెడ్డి,యువశేఖర్,హరిప్రసాద్, టీడీపీ పార్లమెంటరీ యువత సెక్రటరీ డిల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి రేషన్ డీలర్ల సన్మానం




**పలమనేరు మే 30, (పెన్ పవర్) :** పలమనేరు పట్టణ రేషన్ డీలర్లు పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్ర వారం కలసి సన్మానించారు. ఎండియు,(మొబైల్ డిస్పెన్సరి యూనిట్) వాహనాలను తొలగించి రేషన్ సరుకుల పంపిణిని డీలర్లు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని హర్షిస్తూ ఎమ్మెల్యేను కలసి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం డీలర్లపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పారదర్శకంగా నిత్యావసరాల పంపిణిని చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకులు నరేంద్ర కుమార్, మునికృష్ణయ్య, సనాఉల్లా, జుబేర్, జిలాని, రాజేష్ తదితరులున్నారు.

### కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన డా.యల్లంపాటి కోటేశ్వర బాబు



**శ్రీకాళహస్తి/పెన్ పవర్ ప్రతినిధి /మే 30 :** నెల్లూరు జిల్లా కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, కావలిలోని ఆయన స్వగ్రామనందు మర్యాదపూర్వకంగా కలిసిన సంఘ సేవకులు, విశాలాంధ్ర జాతీయ దినపత్రిక శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి,ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు.

### యోగాంధ్ర-2025 కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి...!!



**కడప, పెన్ పవర్ మే 30 :** ఈనెల 21 నుండి జూన్ 21 వరకు"యోగాంధ్ర- 2025" మాసోత్సవాల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. నెల రోజుల పాటు "యోగాంధ్ర- 2025"పై నిర్వహించే వివిధ కార్యక్రమాలు, పీఎం-సూర్యఘర్ పథకం, ఎన్టిఆర్ వైద్యసేవలు, స్వచ్ఛఆంధ్ర, హరితాంధ్ర, హౌసింగ్ తదితర అంశాలపై.. శుక్రవారం సాయంత్రం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ అదితిసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ.. 11వ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో జరగబోయే కార్యక్రమంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని దీనికి రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది హాజరయ్యే లక్ష్యంతో అధికారులు ప్రజలను ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విజన్-2047 లో పేర్కొన్న విధంగా ఆరోగ్య ఆంధ్రను నిర్మించడానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాపై గ్రామ, మండల, జిల్లా స్థాయి పోటీలను నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... జిల్లాలోని ప్రధాన మునిసిపాలిటీలలో, ప్రతి గ్రామంలో యోగ రోడ్డులను ప్రజలందరికీ తెలియజేసి ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు ప్రజలందరూ యోగా చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఆదివారం ఉదయం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని సంస్థాగత, పబ్లిక్ ప్రదేశాల్లో జిల్లాలో యోగా క్యాంపెయిన్ లను నిర్వహించాలన్నారు.

## ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు ఒక రోజు ముందుగానే పంపిణీ

### 2,60,379 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్ దారులకు సూమారు 117.4 కోట్ల రూపాయలు పంపిణీకి సర్వం సిద్ధం : జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్.ఎస్



**తిరుపతి, పెన్ పవర్ మే30 :** జూన్ నెలకు సంబంధించిన 2,60,379 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్ దారులకు సూమారు 117.4 కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు జూన్ 01 వ తేదీ ఆదివారం అయినందున ఒకరోజు ముందుగా మే 31న (నేడే) లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయడానికి సర్వం సిద్ధం అని జిల్లా డా. వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు మే 31 వ తారీఖున పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ డిఎల్డిఓలను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ లో సూచిస్తూ జూన్ మాసం పెన్షన్లను మే 31వ తారీఖున పంపిణీ చేయవలసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ మొత్తాన్ని ఈ నెల మే 30 నాడే సంబంధిత అధికారులు డ్రా చేసి సేఫ్ కస్టడీలో ఉంచుకొన్న మొత్తాన్ని, మే 31 వ తారీఖున సిబ్బంది అందరూ ఉదయం 6.30 గంటల నుంచి పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేయుట కొరకు వారి పంపిణి ప్రదేశాలకి చేరుకొని ఉదయం 6.30 గం లకు యాప్ ఓపెన్ అయ్యాక పింఛను దారులకు పింఛన్లు పంపిణి చేపట్టాలని సూచించారు. మే 31 వ తేదీన ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ పింఛనుదారు ఇంటి నుండి ఖచ్చితంగా 300 మీటర్ల పరిది దాటితే పని చేయదని, పింఛనుదారుల ఇంటివద్దనే పింఛను ఇవ్వాలని, ఏ కారణం చేతనైనా ఇంటివద్ద ఇవ్వడం కుదరకపోతే తగిన కారణాలను యాప్ నందు నమోదు చేయవలయునని తెలియ చేసారు. పింఛను దారులకు ముందుగా నమస్కారం పెట్టి గౌరవంగా చిరునవ్వుతో పింఛను పంపిణీ చేయవలయునని ఆదేశించారు. ఏ కారణం చేతనైనా పింఛను తీసుకోని లబ్ధిదారులకు వారి యొక్క చరవాణి కి సందేశం పంపబడుతుంది. వీరికి 02.06.2025 తేదీ మధ్యాహ్నం 02.00 గం.ల నుండి 05.00 గం.ల వరకు గ్రామ/వార్డు సచివాలయంలో సంబంధిత PS/WEA, WWDS/ WAS వీరికి పించను మొతాన్ని తప్పనిసరిగా పంపిణి చేయాలని తెలిపారు. పెన్షన్ల పంపిణీ మే31న అదే రోజు 100 శాతం ఫించన్ల పంపిణీ చేయాలని, దానికి అనుగుణంగా ఎంపీడీఓ మరియు మునిసిపల్ కమీషనర్లు పింఛను పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ ఇస్తున్న విషయం ప్రతి ఫించన్ దారునికి వ్యక్తిగతంగా తెలియచేయాలని, అలాగే ఫించన్ పంపిణీకి నిర్దేశించిన సిబ్బంది ఉదయం వారి పంపిణీ ప్రదేశానికి ఉదయం 6.30 గం.ల లోగా చేరుకుని తప్పకుండా ఆరోజు ఉదయం 7.00 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఎక్కడ కూడా ఏ ఒక్క పొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ జరగాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి పెన్షన్ పంపిణి చేయు అధికారి పెన్షన్ దారులతో గౌరవ ప్రదంగా వ్యవహరించాలని, అవినీతికి పాల్పడరాదని మరియు ఇంటి వద్దనే ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయవలెనని తెలియజేశారు. ఎవరైనా దీనిని అతిక్రమించినచో క్రమశిక్షణా చర్యలు తీసుకోబడునని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అలాగే గత నెలలలో ఏదేని కారణంతో ఫించన్ తీసుకోని వారికి ఈ నెల పించన్ మొత్తంతో కలిపి పంపిణీ చేయాలని అన్నారు. కావున ఈ సమాచారం అందరికి తెలియచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను, మునిసిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఫించన్ దారులకు అందరికీ IVRS విధానం పై వ్యక్తిగతంగా తెలియచేయాలన్నారు. మరియు వితంతు పించన్లకు సంబంధించిన జాబితాలో అర్హులవి ఎవరిదైనా తమ పేరు రానిచో సంబందిత మండల/మునిసిపల్ కార్యాలయాల్లో తగిన ధ్రువపత్రాలు సమర్పించవలెను. వీటిని ధ్రువీకరించి ఎంపిడిఓ / మునిసిపల్ కమిషనర్ లేఖ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు పంపిన యెడల సెర్ప్ కార్యాలయానికి పంపడం జరుగుతుందని తిరుపతి జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.


## "బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన సదస్సు"






**కర్నూలు పెన్ పవర్ మే 30 :** స్టేట్ లీగల్ సర్వీసెస్, అమరావతి వారి ఆదేశాల మేరకు బి. లీలా వెంకట శేషాద్రి, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు వారు కర్నూలు కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు "బాల్య వివాహ నిరోధక చట్టం " పై పురోహితులకు, పాస్టర్స్ కు, గవర్నమెంట్ కాజి లకు, టెంపుల్స్ ఏ. ఓ. లకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు లో జడ్జి గారు మాట్లాడుతు ఎవరైనా గాని బాల్య వివాహాలు చేయమని మీ దగ్గరికి వస్తే మీరు సంబధిత శాఖ లకు గాని 15100 టోల్ ఫ్రీ నంబర్ కు గాని తెలియ జె స్తే వెంటనే ఆ వివాహాన్ని అపి వేస్తామని తెలిపారు. అలాగే కొత్త చట్టాల ప్రకారం బాల్య వివాహాలు చేసిన వారికి 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష కలదని తెలిపారు. ఐసీడీస్ ఆఫీసర్ శారద మాట్లాడుతూ ప్రతి గ్రామములో గ్రామ కమిటీ లు కలవని వారికి బాల్య వివాహ లపై సమాచారం యిస్తే వెంటనే వారు ఆ వివాహన్ని అపి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తారని తెలిపారు. కర్నూలు సీడీపీఓ అనురాధ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ ఎవరికైనా బాల్య వివాహ లపై సమాచారం తెలిస్తే వెంటనే మహిళ పోలీసు లకు మరియు ఐసీడీస్ ఆఫీసర్ లకు గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఉమాదేవి మాట్లడుతూ చిన్న పిల్లలకు వివాహాలు చేయడం వలన వచ్చే అనారోగ్య సమస్య లను గురించి వివరించారు. మహిళా పోలీస్ యస్. ఐ. కిరణ్ మాట్టాడుతూ బాల్య వివాహలు చేసిన వారికి మరియు చేయించిన వారికి కఠిన శిక్షలు కలవని తెలిపారు. ఆనంతరం బాల్య వివాహ నిరోధక చట్టం పోస్టర్స్ ను విడుదల చేశారు. ఈ సదస్సు లో ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ మరియు టెంపుల్ ఈవోస్,కర్నూలు నగర బ్రాహ్మణ సంఘము అధ్యక్షులు సండే చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులు కంచు గంటల శ్యాంసుందర్, గవర్నమెంట్ ఖాజీ మౌలానా సయ్యద్ అక్బర్ పాహషా రషది,పాస్టర్ కృపాదానం రాజు, అంగన్వాడి కార్యకర్తలుపాల్గొన్నారు.

## డ్రగ్స్ నియంత్రణకు అవగాహనే మార్గం : జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి పెన్ పవర్ మే 30 :** జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్ధాల నివారణకు, ప్రతీఒక్కరికీ అవగాహన కల్పించడమే ఏకైక మార్గమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా ఎస్ పి. హర్షవర్ధన్ రాజు సంయుక్తంగా స్పష్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించి మాదక ద్రావ్యాలు డ్రగ్స్ వినియోగంవల్ల కలిగే దుష్ఫలితాలను యువతకు పెద్ద ఎత్తున వివరించడమే కాకుండా, జిల్లాలో పూర్తిస్థాయి నియంత్రణకు కట్టుధిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతీ విద్యాసంస్థలో అవగాహనా కార్యక్ర మాలను విస్తృతం చేయాలన్నారు. త్వరిత గతిన అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పాఠశాల, కళాశాలలో డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా డీ అడిక్షన్ సెంటర్‌ను పూర్తి స్థాయిలో వసతులు కల్పించి, వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. సంకల్పం గోడ పత్రికలను పెద్ద ఎత్తున ప్రచురించి, విస్తృత స్థాయిలో పంపిణీ చేయాలని, మహిళా సంఘాలకు సైతం పంపిణీ చేయాలని సూచించారు. ఔషధ నియంత్రాణాధికారులు సంయుక్తంగా మందుల షాపులను తనిఖీ చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం, రవాణాపై నిఘాను పెంచి, అరికట్టేందుకు మరింత సమర్ధవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులు చేసేందుకు ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లకు సైతం మాదక ద్రవ్యాలు,గంజాయిపై అవగాహన కల్పించి, దానిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులతో పాటుగా వివిధ వర్గాల వారికి విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా జిల్లాలో డ్రగ్స్ పూర్తిస్థాయిలో అరికట్టడం సాధ్యమవుతుందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్ధాలు, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఎక్కడా గంజాయి, మాదక ద్రావ్యాలను రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీనిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలను తీసు కుంటామని చెప్పారు. మాదక ద్రవ్యాల సరఫరా చేసే వారిని గుర్తించి అరెస్టు చేస్తామని,వారి ఆస్తులను కూడా జప్తు చేస్తున్నామని తెలిపారు. గంజాయి రవాణా హాట్‌స్పాట్లను గుర్తించి, వాటిపై నిఘా ఉంచుతామని తెలిపారు. జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీని ముమ్మరం చేస్తామని చెప్పారు. డాగ్ స్క్వాడ్‌లను కూడా వినియోగిస్తామని తెలిపారు. ప్రత్యేక కార్యక్రమం ద్వారా విస్తృత స్థాయిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. కళాశాలల్లో ఈగల్ టీమ్‌లు, డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మత్తుపదార్ధాల వినియోగాన్ని మాన్పించేందుకు జిల్లాలో డీ అడిక్షన్ సెంటర్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతోనే పూర్తి స్థాయిలో డ్రగ్స్‌ను అరికట్టవచ్చునని ఎస్‌పి తెలిపారు. అనంతరం మాదక ద్రావ్యాల నిషేధం పై పోస్టర్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి, డిఆర్‌ఓ, ఆర్‌డిఓలు విడుదల చేసారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డిఓలు తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్, డి ఈ ఓ కుమార్, ఆర్ టి ఓ మురళీమోహన్, డి సి హెచ్ ఎస్ ఆనందమూర్తి, ఆర్టిసి ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటిండెంట్ వాసుదేవ చౌదరి, రుయా హాస్పిటల్ సూపరింటిండెంట్. డా రాధా, డ్రగ్స్ అధికారి, సంబంధిత జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జూన్ 1 నుండి రేషన్ సరుకులు చౌక దుకాణాల ద్వారా పంపిణీ : జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

**రాయచోటి, పెన్ పవర్ మే 30 :** అన్నమయ్య జిల్లా లోని రేషన్ కార్డు దారులకు తెలియజేయడం ఏమనగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1తేది నుండి రేషన్ సరుకులు చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయబడతాయని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి నెల 1వ తేదీ నుంచి15వ తేదీ వరకు ప్రతి రోజు నిర్దేశించిన సమయాల్లో ఉదయం 8.00 నుండి 12.00 గంటల వరకు మరియు సా.4.00 గంటల నుండి 8.00 గంటల వరకు చౌక ధరల దుకాణాలను తెరిచి ఉండాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. ఏక లేదా ద్విసభ్య కార్డులలోని వారి వయస్సు 65 సంవత్సరాలు పైబడి వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ 1 తేది నుండి 5 వతేది వరకు 12 గంటల నుండి 4 గంటల మద్య సమయములో పంపిణి చేయబడును. చౌక ధరల దుకాణముల ద్వారా బలవర్ధకమైనబియ్యము, చెక్కర మరియు కొన్ని దుకాణములనందు జొన్నలు కూడా లబ్యాముగా వున్నవి. బియ్యం మరియు జొన్నలు పూర్తిగా ఉచితం. తెల్ల రేషన్ కార్డుదారులకు చెక్కర అరకిలో ఏ రు.17/కు, అంత్యోదయ కార్డుదారులకుచెక్కర ఒకకిలో ఏ 13.50కు లభించును. కార్డుదారులు తప్పక రసీదు పొందవలెనని తెలియజేయడమైనది.

### నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్, 22ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ మే 30 :** అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లాస్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ, డిఎల్పి/డిఎల్ఎస్సి సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ ని, 22ఏ భూములను తొలగించేందుకు, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో 22ఏకు సంబంధించి 16 క్లెయిమ్స్ని విచారించడం జరగగా, డాటెడ్ ల్యాండ్స్‌కి సంబంధించి 31 దరఖాస్తులపై సమావేశం నిర్వహించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించి విచారించి నిబంధనల ప్రకారం అన్ని వివరాలు సక్రమంగా ఉన్నవి ఆమోదించగా, పూర్తి వివరాలు సరిగా లేనివాటికి సంబంధించి పునః పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఆర్బిఎస్కె శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## పైపై... స్థితులకు చేర్చేది నైతికత్వమే...

### - మాస్టారు పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి







**కడప పెన్ పవర్ మే 30 : ప్రేమ యొక్క శక్తి :** ఆరోజుల్లో" కేవలం ఒక స్త్రీ కోసం"చక్రవర్తి సింహాసనాన్ని వదులుకోవడం అనేదే నేను ఆలోచించాను.ఆయన తలచుకుంటే ఎంతో మంచి అందగత్తెలను అతను పొందగలిగే వాడు అని తర్కం చెపుతోంది.ఒకరాజు అడగవలసి ఉందా? అయినప్పటికీ ఆకాలంలో బ్రిటిష్ సామ్రాజ్యపు సింహాసనాన్ని వదులుకున్నాడు. ప్రేమ యొక్క శక్తి అది.ప్రేమ త్యాగం చేస్తుంది తప్ప దేనినీ కోరదు.ఆయన స్త్రీ ప్రేమకోసం సింహాసనాన్ని త్యాగం చేసాడు.అలాగే మనము ఎన్నడూ చూడని, అనుభూతి చెందని,స్పృశించని దేవుని కోసం,మహర్షులు, గొప్పగొప్ప యోగులూ తమ జీవితాన్ని,తమ అస్తిత్వాన్ని అంతటినీ త్యాగం చేసారు. ప్రేమ యొక్క శక్తి ఎలాంటిదో చూడండి .దాని ద్వారా అతిగొప్ప త్యాగం సాధ్యపడుతుంది.డబ్బు మరింత డబ్బు సంపాదించడానికి మాత్రమే నీకు ఉపయోగపడుతుంది.అది నీకు ఆనందాన్ని ఇవ్వలేదు.అది నీకు నైతిక విలువలను ఇవ్వజాలదు.అందుకే తమ సంపదను త్యాగం చేసిన ధనవంతులు గురించే మన సాంప్రదాయం ఎల్లప్పుడూ చెపుతుంది.వారు తెలివైనవారు కాబట్టే తమ సహజజ్ఞానంతో దీనిని గ్రహించారు.అందుకే దీనిని హృదయపథం అనీ, సహజమార్గము అనీ మాష్టరుగారు అన్నారు.మనకు ఒక మెదడు, ఇతరమైనవన్నీ మనము మన గమ్యాన్ని చేరుకోవడం కోసమేనని మనం గుర్తిస్తాం." మనల్ని మనం జీవితపు ఉన్నతమైన స్థితులకు చేర్చేందుకు ఈ జీవితాన్ని ఒక విధమైన వాహనంలా భావించాలి" అన్నారు.ఒకవేళ ఈ ప్రయోజనం నెరవేరకపోతే,అది నెరవేరేవరకూ మనం ఇక్కడే ఉంటాం.

**ప్రతిఫలాలు,శిక్షలు :** సహజమార్గ సాంప్రదాయంలో ప్రతిఫలాలు, శిక్షలు ఏవీ లేవు. సుగుణాలు, దుర్గుణాలు అనే ప్రసక్తేలేదు.గురువర్యుల అభిప్రాయం ప్రకారం అంతకంతకూ పురోగతిలో మనల్ని పైపై స్థితులకు చేరుస్తూ ఉండేది ఈ నైతికత్వమే. అందరూ చేసే పనే సరైనది అనే ఒక విధమైన ఆలోచన ద్వారా ఒక విధమైన బూటకపు భద్రతలో,బూటకపు సాంఘిక ఆమోదంలో మనం మనల్ని జోకొట్టుకుంటూ సముదాయించుకుంటున్నాం."నలుగురితోపాటు నారాయణా" అనేది ఎప్పుడూ తప్పే. ఎందుకంటే మానవుని చరిత్రను మీరు అధ్యయనం చేస్తే , శతాబ్దాలుగా సంభవించిన మానవాభివృద్ధిని పరిశీలిస్తే మంచిది,ఉదాత్తమైన ది,సరైనది అనే ఏదైనా ఎప్పుడూ సంఘంలో నైతికంగా ఉన్నతస్థితిలో ఉన్న ఏకొద్దిమంది మాత్రమే చేసారని తెలుస్తుంది. "అందరూ అలాగే చేస్తున్నారు, నేనేం చెయ్యగలను? అని వాదిస్తారు.ఇలా వాదించడం వల్ల చేసిన తప్పు ఒప్పు అవ్వదు.

## ఆకాశగంగ, పాపవినాశనం, సీఆర్వో ఆధునీకరణపై ఈఓ సమీక్ష



**తిరుమల పెన్ పవర్ మే 30 :** తిరుమలలోని ఆకాశగంగ, పాపవినాశనం, సీఆర్వో అభివృద్ధి మరియు ఆధునీకరణ పై టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధ్యక్షతన తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి సంబంధిత నిపుణులు తాము రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈవో మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల పర్యావరణ మరియు ఆధ్యాత్మిక అభివృద్ధి రూప కల్పన చేయాలన్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పటిష్టమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా తిరుమలలోని కేంద్రీయ విచారణ కార్యాలయం (సీఆర్వో) ఆధునీకరణపై కూడా ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అత్యాధునిక సౌకర్యాలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సీఆర్వో చుట్టు పక్కల ఉన్న ఖాళీ ప్రాంతాలను కూడా భక్తులకు సౌకర్యవంతంగా తీర్చి దిద్దేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశాల్లో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ, అర్బన్ డెవలప్మెంట్ అండ్ డిజైనింగ్ నిపుణులు శ్రీ రాముడు ఇతర అధికారులు పాల్గొన్నారు.